RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 16 డిసెంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 217 | పేజీలు: 4 | వెల: రూ.5/-

### ఫలితాలు రానప్పుడు మాత్రమే..
## ఈవీఎంలను ప్రశ్నించడం తప్పు
### ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్: (ప్రభాత సూర్యుడు): జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రానప్పుడు మాత్రమే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్స్ (ఈవీఎం)పై ప్రశ్నించడం తప్పని అన్నారు. ఓటింగ్ యంత్రాంగంపై నమ్మకం లేని పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయకూడదని సూచించారు. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్న 'ఇండియా' బ్లాక్ పార్టీలకు తన వ్యాఖ్యలతో షాక్ ఇచ్చారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్‌కు డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష కూటమిలో భాగమైన ఒమర్ అబ్దుల్లా పీటీఐ వార్తా సంస్థకు

..మిగతా 3లో


# నిరుపేదలకు
# సర్కార్ గుడ్‌న్యూస్

### బ్యాంక్ ఖాతాల్లో జమ: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): భూమిలేని నిరుపేద కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పేద కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీని ఈనెల 28 నుంచి కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద కూలీలకు మొదటి విడతగా రూ.6 వేలు : దేశ స్వాతంత్ర్యం కోసం ఏర్పడినటువంటి కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం రోజు డిసెంబరు 28న నిరుపేద కూలీలకు మొదటి విడత డబ్బులు 6వేల రూపాయలు ఇస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. వచ్చే సంక్రాంతి నుంచి అన్నదాతలకు రైతు భరోసా డబ్బులు అందజేస్తామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయానికి, రైతన్నల కోసం నేరుగా రూ.50,953 కోట్లు ఖర్చు చేసిందన్నారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి బీఆర్ఎస్ రైతులకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు భ్రమలు కలిగించి ప్రజలను మోసం చేయడమే బీఆర్ఎస్ నాయకులకు తెలుసని భట్టి విక్రమార్క విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల విస్తరణకోసం ప్రజా ప్రభుత్వం కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టుల ఏర్పాటు చేయనుందని వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి తలమానికంగా మూసీని అభివృద్ధి చేయడానికి మూసీ పునరుజ్జీవ కార్యక్రమం చేపట్టామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్‌రోడ్ : అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్‌రోడ్ ఏర్పాటు చేస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఔటర్ రింగ్‌రోడ్, రీజినల్ రింగ్‌రోడ్ మధ్య

..మిగతా 2లో



### ఒకే దేశం-ఎన్నిక బిల్లుపై కేంద్రం
# పునరాలోచన?
### పార్లమెంట్‌లో బిల్లు పెట్టేది అనుమానమే!

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ఒకే దేశం-ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. వాస్తవానికి, సోమవారం పార్లమెంట్‌లో బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల (సవరణ) బిల్లులను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు జాబితా చేసింది. తాజాగా సవరించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో సోమవారం నాటి ఎజెండాలో ఈ రెండు బిల్లులను తొలగించింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20న ముగియనున్నారు. గురువారం కేబినెట్ రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు- 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు), 2024కి ఆమోద ముద్ర వేసింది. ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం బిల్లులకు సంబంధించిన ప్రతులను సభ్యులకు పంపిణీ పూర్తయ్యింది. ఈ క్రమంలో కేంద్రం బిల్లులను ప్రవేశపెడుతుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి జమిలీ ఎన్నికల కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణను చేర్చాల్సి రానున్నది. పార్లమెంట్ పదవీకాలంలో మార్పు కోసం 83 అధికరణ, అసెంబ్లీ పదవీకాలం సవరణ కోసం 327 అధికరణను సవరించాల్సి ఉంటుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు రాజ్యాంగ (129వ సవరణ) బిల్లును కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. ముసాయిదా బిల్లుల ప్రకారం సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశానికి రాష్ట్రపతి నోటిఫై చేసిన తేదీ నుంచి ఏకకాల ఎన్నికలు అమలులోకి వస్తాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. ఈ నియమిత తేదీ తర్వాత ఎన్నికైన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాలు, లోక్‌సభ పూర్తికాల వ్యవధితో పాటు ముగిసేలా తగ్గిస్తారు. తద్వారా ఏకకాల ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. 2024 లోక్‌సభకు సంబంధించి మొదటి సమావేశం ముగిసిందున.. తదుపరి లోక్‌సభ ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ లోక్‌సభ తొలి సమావేశంలో రాష్ట్రపతి నోటిఫై చేస్తే.. ఆ లోక్‌సభ పూర్తి పదవీ కాలం ఉంటే 2034లో తొలి విడత జమిలీ ఎన్నికలు జరుగుతాయి. బిల్లు ప్రకారం అసెంబ్లీలకు ఉన్న నిబంధనలు కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరికి వర్తిస్తాయి. కొత్త జమిలి ఎన్నికల బిల్లు ప్రకారం నిర్దేశిత కాల పరిమితి కన్నా ముందే పార్లమెంట్, రాష్ట్ర, యూటీల అసెంబ్లీలు రద్దయితే, ఆయా అసెంబ్లీలకు, పార్లమెంట్‌కు మిగిలి ఉన్న కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి.



## అయ్యప్ప భక్తుల బస్సును ఢీకొట్టిన కారు

### నవ దంపతులు సహా నలుగురు మృతి

తిరువనంతపురం, (ప్రభాత సూర్యుడు): కేరళలో తీవ్ర విషాదం నెలకొంది. పెళ్లయిన 15 రోజులకే రోడ్డు ప్రమాదంలో నవ వధూవరులు దుర్మరణం చెందారు. శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప భక్తుల బస్సును కారు ఢీకొట్టడంతో నవ దంపతులు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళలోని పథానంతిట్టకు చెందిన అను, నిఖిల్‌కు 15 రోజుల కిందట వివాహమైంది. పెళ్లి తర్వాత హనీమూన్‌కు మలేసియాకు వెళ్లి ఇవాళ తిరిగి కేరళకు వచ్చారు. ఈ క్రమంలో తిరువనంతపురంలో కొత్త దంపతులను రిసీవ్ చేసుకోవడానికి నిఖిల్ తండ్రి మథాయ్ ఈపన్, అను తండ్రి జార్జ్ బిజులు వెళ్లారు. వారంతా కారులో బయల్దేరి సొంతూరికి వెళ్తుండగా ఆదివారం ఉదయం 4.05 గంటల ప్రాంతంలో పనలూరు-మువట్టుపుజ రహదారిపై పథానంతిట్ట జిల్లా మురింజకల్ వద్ద ప్రమాదం జరిగింది. తెలంగాణకు చెందిన అయ్యప్ప భక్తులు వెళ్తున్న బస్సును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నిఖిల్, జార్జ్ బిజు, ఈపన్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అను మృతి చెందింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ సహా పలువురు అయ్యప్ప భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జవ్వడంతో హైడ్రాలిక్ సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

## కేసీఆర్‌కు పీసీసీ చీఫ్ కీలక లేఖ

### ఏడాది కాలంలోని కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల వివరాలతో లేఖ
### రాష్ట్రాన్ని అప్పులుపాలు చేసిందెవరు? అంటూ ప్రశ్నల వర్షం



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు నిరంతరం బురద జల్లుతూ ప్రజలను తప్పుదారి పట్టించడం మానుకోవాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. ఆరు పేజీల బహిరంగ లేఖలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు పోరాటం చేసిందెవరు? దాని ఫలితం అనుభవించిందెవరు? మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని ఇస్తే అప్పుల పాలు చేసిందెవరు? అంటూ సవాలక్ష ప్రశ్నలతో బహిరంగ లేఖను పంపారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఆ లేఖలో వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై స్పష్టత ఇచ్చే దిశలో తాను

..మిగతా 2లో

## నేటి నుండి అసెంబ్లీ సమావేశాలు



### ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యేలకు సంతాపం తెలపనున్న శాసన సభ
### పలు బిల్లులపై ప్రతిపాదన
### పర్యటక విధానంపై స్వల్పకాలిక చర్చ

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలంగాణ రాష్ట్ర శాసన సభ సమావేశాలు రెండో రోజు నేటి (సోమవారం) నుండి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ఇటీవల మృతి చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలకు శాసనసభ సంతాపాన్ని తెలపనున్నారు. కరీంనగర్ జిల్లా పూర్వ మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతిదేవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, మెదక్ జిల్లా పూర్వ

..మిగతా 2లో



## మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ

### 39 మందితో ప్రమాణస్వీకారం
### బీజేపీ -19 . షిండే శివసేన-11, ఎన్‌సీపీ నుంచి 9

ముంబై, (ప్రభాత సూర్యుడు): మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సారథ్యంలోని 'మహాయుతి' ప్రభుత్వంలో కొత్తగా 37 మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బీజేపీ నుంచి 19 మంది, 11 మంది షిండే శివసేన నుంచి, ఏడుగురిని ఎన్‌సీపీ నుంచి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. నాగపూర్‌లోని రాజ్‌భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణ కొత్త మంత్రు లతో ప్రమాణం చేయుంచారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# తనలాగే అందరూ జైలుకెళ్లి రావాలని అనుకుంటున్నారేమో

## సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): సీఎం రేవంత్ రెడ్డి తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. డబ్బు సంచులతో రెడ్ హ్యాండెడ్‌గా దొరికి జైలుకు వెళ్లొచ్చిన రేవంత్ రెడ్డి.. తనలాగే అందరూ జైలు జీవితాన్ని అనుభవించాలని భావిస్తున్నట్లు ఉన్నారని విమర్శించారు. ఈ మేరకు ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ట్విట్టర్ (ఎక్స్) ద్వారా షేర్ చేస్తూ మండిపడ్డారు. ఓ ప్రభుత్వ స్కీమ్ ద్వారా తమ సంస్థపై ప్రభావం పడే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు జైలుకు పంపిస్తానని ప్రతిష్టాత్మక సంస్థ అయిన L&T కంపెనీకి చెందిన CXOను బహిరంగంగా, నిర్మొహమాటంగా బెదిరిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇలాంటి పనికిమాలిన ప్రకటనలతో పారిశ్రామిక వర్గాలకు ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారని ప్రశ్నించారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఇదేనా మీరు అనుసరిస్తున్న వ్యూహమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీని నిలదీశారు.



# కస్తూర్బా పాఠశాలలకు కూడా డైట్ చార్జీలు పెంచాలి

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): గురుకుల పాఠశాలల విద్యార్థులకు పెంచిన డైట్‌చార్జీలను కస్తూర్బా పాఠశాలలకు కూడా వర్తింప చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినిలతో మాట్లాడారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రభుత్వ గురుకుల సాంఘిక సంక్షేమ హాస్టళ్లల్లో మధ్యాహ్నభోజనం ధరలు పెంచుతున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆమె తెలిపారు. గురుకులాల్లో మార్పుల్లో కస్తుర్బా పాఠశాలలు లేకపోవడం బాధకరమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 472 కస్తూర్బా పాఠశాలలున్నాయని, సర్వశిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమ్మెలో ఉన్నారని, వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కస్తూర్బా అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు గురుకుల పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్‌కు కృషి చేశానని, త్వరలో కళాశాల ప్రారంభిస్తుండడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతీ అంశంపై బీఆర్ఎస్ ఉద్యమించి హక్కులను సాధించుకుంటుందని పేర్కొన్నారు.

# రాష్ట్రంపై చలి పంజా

## భారీగా పడిపోయిన ఉష్ణోగ్రత

## ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో 6.3 డిగ్రీలుగా నమోదు

## 12 జిల్లాల్లో సింగిల్ డిజిట్



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో చలిపంజా విసురుతున్నది. అల్పపీడన ప్రభావంతో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. పెరిగిన చలి తీవ్రతతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 6.3 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. నిర్మల్ జిల్లా తాంద్రలో 6.6, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 6.7, సంగారెడ్డి 6.8, కామారెడ్డి 7.6, నిజామాబాద్ 7.7, మెదక్ 8, జగిత్యాల 8, వికారాబాద్ 8.2, రాజన్నసిరిసిల్ల 8.6, సిద్ధిపేట 8.6, రంగారెడ్డి 8.9, పెద్దపల్లిలో 9.5 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లో 15 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 14 డిగ్రీల సెల్సియస్‌కు తకువగా నమోదయ్యాయి. రానున్న రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది.




# నేటి నుండి అసెంబ్లీ సమావేశాలు

మొదటి పేజీ తరువాయి...

దొమ్మాట మాజీ ఎమ్మెల్యే డి.రామచంద్రారెడ్డిలకు శాసన సభ సంతాపం తెలపనుంది. దీంతో పాటు రాష్ట్రంలో వ్యాయమ విద్యను బలోపేతం చేసేందుకు అలాగే క్రీడాకారులకి ప్రపంచస్థాయిలో ప్రతిభ కనపరిచి రాష్ట్రానికి పేరు తెచ్చేందుకు క్రీడా పాలసీ, క్రీడా యూనివర్సిటీ బిల్లును ప్రవేశపెట్టేందుకు, తెలంగాణ విశ్వవిద్యాలయ సవరణ బిల్లు ప్రవేశపెట్టేందుకు అనుమతి కోసం ప్రతిపాదించనున్నారు. అనంతరం రాష్ట్రంలో పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ ఉంటుందని శాసనసభ కార్యదర్శి నరసింహచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

### శాసన మండలిలో..

ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ మాజీ సభ్యులు ఎస్ ఇంద్రాసేనారెడ్డి మృతి పట్ల మండలిలో సంతాపం తెలపనున్నారు. అనంతరం అనంతరం రాష్ట్రంలో పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ ఉంటుందని శాసనసభ కార్యదర్శి తెలిపారు.

# నిరుపేదలకు సర్కార్ గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి...

ఇండస్ట్రియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు అందించబోతున్నామన్నారు. రాష్ట్ర అప్పులపై బీఆర్ఎస్ నాయకులు పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆసుపత్రులు, ఉద్యోగుల జీపీఎఫ్, మధ్యాహ్న భోజనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలు రూ.40,154 కోట్లు. పదేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7,11,911 కోట్లు అప్పులు చేసి ప్రజలపై భారం మోపిందని భట్టి విక్రమార్క ఆక్షేపించారు. ప్రజాప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోంది : రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు 2014 నాటికి ఏడాదికి చెల్లించాల్సిన అప్పు 6,400 కోట్ల రూపాయలు ఉండగా, పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అప్పుల వల్ల ఏడాదికి రూ.66,782 కోట్లు చెల్లించే దుస్థితికి బీఆర్ఎస్ తీసుకెళ్లిందని భట్టి విక్రమార్క విమర్శించారు. సన్నాలపై క్వింటాకు ఇస్తున్న రూ.500 బోనస్ ద్వారా ప్రతి ఏకరానికి రూ.10వేల నుంచి 15వేల వరకు అదనంగా రైతులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోందన్నారు. ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి రైతులకు నేరుగా 50,953 కోట్ల రూపాయలు ఖర్చుచేసిందని భట్టి విక్రమార్క తెలిపారు.

# కేసీఆర్‌కు పీసీసీ చీఫ్ కీలక లేఖ

మొదటి పేజీ తరువాయి...

ఈ లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతోనే తెలంగాణ వెనకబాటుకు గురైందని ఆరోపించారు. సెంటిమెంట్ పేరుతో రెండుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలోకి వచ్చిన కేసీఆర్, గడీల పాలన చేసి ప్రజలకు కన్నీరు మిగిల్చారని విమర్శించారు. నిరంతరం ఫాంహౌస్‌లోనే : రాష్ట్రానికి గుండెకాయలాంటి సచివాలయానికి రాకుండా ఫాంహౌస్‌కే పరిమితమై పాలన సాగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. మొదటి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని చెప్పి, తిమ్మిని బమ్మిని చేసి కేసీఆర్ సీఎం కుర్చీలో కూర్చున్నారని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఉద్యమించి, మాయమాటలతో పీఠమెక్కిన కేసీఆర్ అన్యాయంతో పాలన సాగించారని విమర్శించారు. ఉద్యమంలో కవులు, కళాకారులు, మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఇలా సబ్బండ వర్గాలు ప్రాణాలకు తెగించి పోరాడితే చివరకు కేసీఆర్ రాష్ట్రాన్ని తమ కుటుంబ సభ్యుల కబంధ హస్తాల్లో బంధించి భ్రష్టు పట్టించారని ఆరోపించారు. బీఆర్ఎస్ పెత్తందారి సర్కార్ వల్ల విసిగిపోయిన ప్రజలు ఆ పాలనకు చరమగీతం పాడారని విమర్శించారు. అయినా కల్వకుంట్ల కుటుంబ సభ్యుల్లో కానీ, ఆ పార్టీ నేతల్లో కానీ ఎలాంటి మార్పు రాలేదని ఆరోపించారు.

బీఆర్ఎస్ అసత్యాల ప్రచారం : తెలంగాణ ఏర్పాటుకు సబ్బండ వర్గాలు పోరాడగా, సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇచ్చినట్లు విశ్వసించి ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని వివరించారు. ప్రజలు తమకు అధికారం కట్టబెడితే ఓర్వలేక బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, ఆ పార్టీ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇదే పంథాలో సాగితే మీకు తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. మూసీ పునరుజ్జీవనం కోసం అవినీతి జరిగిందని కేటీఆర్ గగ్గోలు పెడుతున్నారని ఆరోపించిన మహేశ్ కుమార్ గౌడ్, ఆ ప్రాజెక్టు డీపీఆర్ కోసం కేవలం రూ.150 కోట్లు ఖర్చు చేశామని, అంతకు మించి రూపాయి కూడా అదనంగా వ్యయం చేయలేదన్న వాస్తవాన్ని కేసీఆర్ గ్రహించాలన్నారు.

అందె శ్రీపై కక్ష : జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం గీత రచయిత అందె శ్రీపై మీరు కక్ష గట్టి అవమానించారని, పదేళ్లు అధికారిక గీతం లేకుండా వ్యవహరించినట్లు ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం గీతాన్ని అధికారికంగా ప్రకటించడంతో పాటు ఆ రచయితను గౌరవించుకోవడం తాము గర్వంగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు అవాకులు చెవాకులు పేల్చడం మానుకునేలా కేసీఆర్ చూస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ



మొదటి పేజీ తరువాయి...

ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. డిసెంబర్ 5న ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవిస్, ఉపముఖ్యమంత్రులుగా అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే ప్రమాణం చేసిన విషయం విదితమే. అనంతరం తొలిసారి ఆదివారం మంత్రివర్గ విస్తరణ జరిగింది. బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే, రాధాకృష్ణ విఖే పాటిల్, ఆశిష్ షెలార్, చంద్రకాంత్ పాటిల్, గిరీష్ మహాజన్, గణేష్ నాయక్, మంగళ్ ప్రతాప్ లోధా, జయకుమార్ రావల్, పంకజ ముండే, అతుల్ సావే మంత్రులుగా ప్రమాణస్వీకారం నుంచి. కాగా, షిండే శివసేన నుంచి దాదా భుసే, శంభురాజ్ దేశాయ్, సంజయ్ రాథోడ్, గులాబ్‌రావు పాటిల్, ఉదయ్ సామంత్ ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. అజిత్ పవార్ ఎన్‌సీపీ నుంచి మాణిక్రావు కోకటే, దత్తాత్రేయ్ విఠోభా భర్నే, హసన్ ముష్రిఫ్, అదితి సునీల్ టట్కరే, ధనంజయ్ ముండే ప్రమాణస్వీకారం చేశారు. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మహాయుతి కూటమి 230 స్థానాలను కైవసం చేసుకుని మరోసారి అధికార పగ్గాలు చేపట్టింది. కేబినెట్ విస్తరణలో భాగంగా 37 మందికి చోటు కల్పించగా. మహా క్యాబినెట్‌లో గరిష్ఠంగా 43 మందిని తీసుకునే అవకాశం ఉంటుంది. త్వరలో మిగిలిన వారిని కూడా తీసుకోనున్నారు.



# తబలా వాయిద్య కారుడు జకీర్ హుస్సేన్ కన్నుమూత

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): తబలా వాయిద్య కారుడు జకీర్ హుస్సేన్ (73) ఆదివారం కన్నుమూశారు. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో లో గల ఓ దవాఖాన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో గుండె సంబంధ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించారు. బీపీతో జకీర్ హుస్సేన్ బాధ పడుతున్నారని ఆయన మేనేజర్ తెలిపారు. ప్రముఖ తబలా వాయిద్యా కారుడు ఉస్తాద్ అల్లా రఖా పెద్ద కుమారుడే జకీర్ హుస్సేన్. తబలా వాయిద్యంలో తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లిన జకీర్ హుస్సేన్.. దానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకు వచ్చారు. వారం రోజులుగా జకీర్ హుస్సేన్ గుండె సంబంధ ఆరోగ్య సమస్యలతో శాన్ ఫ్రాన్సిస్కో లోని దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. 1988లోనే పద్మ శ్రీ, 2002లో పద్మ భూషణ్, 2023లో పద్మ విభూషణ్ అవార్డులను గెలుచుకున్నారు. సంగీత నాటక్ అకాడమీ అవార్డుతోపాటు రెండు సార్లు ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డును సొంతం చేసుకున్నారు. 1951 మార్చి తొమ్మిదో తేదీన మహారాష్ట్రలోని ముంబైలో జకీర్ హుస్సేన్ జన్మించారు. కథక్ నృత్యకారిణి, తన మేనేజర్ అంటోనియా మిన్నెకొలాను పెండ్లి చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు- అనిషా ఖురేషి, ఇసాబెల్లా ఖురేషీ ఉన్నారు. యూసీఎల్ఏలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అనిషా ఒక సినిమా నిర్మాతగా ఉన్నారు. మాన్ హట్టన్ లోని ఇసాబెల్లా నృత్యవిద్యనభ్యసించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా: అల్లు అర్జున్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): కేసు విచారణ కొనసాగుతున్నందున శ్రీతేజ్‌ను కలవలేక పోతున్నానని హీరో అల్లు అర్జున్ తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నటువంటి బాలుడి గురించి ఆందోళన చెందుతున్నానని ఆయన సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారు. 'బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం అతడిని(శ్రీతేజ్ ) కలవలేకపోతున్నా. వాళ్ల ఇంటికి వెళ్లలేకపోతున్నాను. త్వరలోనే వారి ఫ్యామిలీని కలిసి మాట్లాడతాను. వారిని ఆదుకుంటానని ఇచ్చిన మాటకి కట్టుబడి ఉన్నా"అని అర్జున్ తెలిపారు. బాధిత కుటుంబానికి 25 లక్షల రూపాయల సాయం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టుగా బన్నీ కొద్ది రోజుల క్రితమే ప్రకటించిన సంగతి విధితమే. చికిత్స ఖర్చులూ భరిస్తానని, ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఆ ఘటనకు సంబంధించిన కేసులో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు ఈ నెల 13న అరెస్టు చేసిన సంగతి విధితమే. చంచల్‌గూడ జైలులోనే ఆ రాత్రంతా ఉన్న ఆయన హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయడంతో శనివారం ఉదయం విడుదలయ్యారు.

# మెట్రో స్టేషన్లపై తర్జనభర్జనలు



## ఫేస్-2లో మారుతున్న స్టేషన్ల సంఖ్య

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మెట్రో ఫేస్-2లో స్టేషన్ల సంఖ్యపై హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో అథారిటీ తర్జన భర్జనలు పడుతున్నది. 76.4 కిలోమీటర్ల, 54 స్టేషన్లతో నిత్యం 8 లక్షల మంది ఐదు కారిడార్లలో ప్రయాణించేలా డీపీఆర్ సిద్ధం చేశారు. అయితే తాజాగా కొన్ని మార్గాల్లో స్టేషన్లను తగ్గించే యోచనలో మెట్రో ఉన్నట్లు తెలిసింది. దీని ద్వారా ఆయా మార్గాల్లో మెట్రో వేగం పెరుగుతుందని చెబుతుండగా, ప్రస్తుతం ఉన్న కారిడార్లలో గంటకు 35 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుండగా, భవిష్యత్‌లో ఈ వేగం మరో ఐదు కిలోమీటర్లు పెరుగుతుందని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించారు. ఈ క్రమంలోనే మెట్రో స్టేషన్ల కుదించాలా? వద్దా అనే అంశంలో హెచ్‌ఏఎంఎల్ సమాలోచనలు చేస్తున్నది.

### రూ. 24.3వేల కోట్ల అంచనా వ్యయంతో..

దాదాపు రూ. 24.3వేల కోట్ల అంచనా వ్యయంతో మెట్రో ఫేస్-2 చేపట్టనున్నారు. 54 స్టేషన్లను ప్రతిపాదించారు. ఇందులో ప్రధానంగా కారిడార్-4లో ఉన్న నాగోల్-శంషాబాద్ మెట్రో మార్గంలో 24 స్టేషన్లు ఉండగా, 13.4 కిలోమీటర్లు ప్రయాణించే కారిడార్-7లో మియాపూర్-పటాన్‌చెరులో 10 స్టేషన్లు ఉన్నాయి. ఈ రెండు మార్గాల్లో ప్రధానమైన ఎయిర్‌పోర్టు మెట్రో విషయంలో వేగాన్ని పెంచేందుకు స్టేషన్లను కుదించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ దీంతో భవిష్యత్‌లో ఈ మార్గంలో కొత్త మెట్రో స్టేషన్ల నిర్మాణం సాధ్యం కాదనే క్రమంలో.. స్టేషన్ల కుదింపు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

### మార్పులు జరిగే అవకాశం..

ప్రస్తుతం 54 స్టేషన్లతో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును హెచ్‌ఏఎంఎల్ రూపొందించి కేంద్రానికి అందజేసింది. ప్రస్తుతం కేంద్ర పరిశీలనలో ఉంది. డీపీఆర్ అధ్యయనం, పరిశీలన తర్వాత కేంద్రం పలు సూచనలు చేసే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో ప్రాజెక్టు అంచనా వ్యయం, స్టేషన్లు, భూ సేకరణ వంటి అంశాలపై కేంద్ర సూచనలకు అనుగుణంగా మార్పులు జరిగే అవకాశం ఉంటుంది. ఆ లోపే మెట్రో స్టేషన్లను కుదించి, తుది ఆమోదం కోసం రివైజ్ డీపీఆర్ సిద్ధం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మెట్రో స్టేషన్ల కుదింపు అంశంపై మెట్రో వర్గాల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్మాణం వ్యయం కూడా తగ్గనున్నది. కానీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్టేషన్ల నిర్మాణం జరగాల్సి ఉంటుంది. కానీ అనూహ్యంగా స్టేషన్ల సంఖ్యను కుదించాలని మెట్రో భావించడంపై ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పెదవి విరుస్తున్నారు. తమ ప్రాంతానికి రవాణా సదుపాయాలను కోల్పోయే ప్రమాదం ఉంటుందని, ప్రతిపాదిత అలైన్‌మెంట్ ప్రకారమే మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.



# ఢిల్లీ ఎన్నికల కోసం ఆప్ తుది జాబితా

## న్యూఢిల్లీ నుంచి అరవింద్ కేజ్రీవాల్ పోటీ

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం నాలుగో జాబితా విడుదల చేసింది. తుది జాబితాలో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ సీటు నుంచి అలాగే కల్కాజీ నుంచి సీఎం అతిషి పోటీ చేయనున్నారు. గ్రేటర్ కైలాష్ నుంచి మంత్రి సౌరభ్ భరద్వాజ్, బాబర్‌పూర్ నుంచి గోపాల్ రాయ్ బరిలోకి దిగుతున్నారు. శకుర్ బస్తీ నుంచి సత్యేంద్ర కుమార్ జైన్, రాజిందర్ నగర్ నుంచి దుర్గేష్ పాఠక్ పోటీ చేయనున్నారు. కాగా, తుది జాబితా ప్రకటనతో ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. తమ పార్టీ పూర్తి విశ్వాసంతో, సన్నాహాలతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుందని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'బీజేపీ కనిపించదు. సీఎం ఫేస్ వ్యక్తి, బృందం, ప్రణాళిక, ఢిల్లీపై దృష్టి వారికి లేదు. వారికి ఒకే ఒక్క నినాదం ఉంది. 'కేజ్రీవాల్‌ను తొలగించండి'. ఈ ఐదేళ్లలో ఏమి చేశారో వారిని అడగండి. 'కేజ్రీవాల్‌ను మేం దుర్భాషలాడాం' అని చెబుతారు' అని విమర్శించారు. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ప్రజాకోర్టు' తీర్పు తర్వాత మాత్రమే తిరిగి ఆ పదవి చేపడతానని అన్నారు. అలాగే కాంగ్రెస్‌తో ముందస్తు ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని తేల్చిచెప్పారు. సొంత బలంతోనే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.



# భార్యతో కలిసి ఆప్‌లో చేరిన.. బీజేపీ నేత రమేష్ పెహల్వాన్

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): బీజేపీ నేత రమేష్ పెహల్వాన్ తన భార్య కుసుమలతతో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో ఆదివారం చేరారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకుని సభ్యత్వం తీసుకున్నారు. (%దీజీూ ాముఁనవతీ జీశీఅఅం ాూ్రూ%) ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు ఆప్‌లో చేరారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు పోటీలో ఉన్నారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం నాలుగో జాబితాను ఆప్ ఆదివారం విడుదల చేసింది. తుది జాబితాలో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ సీటు నుంచి అలాగే కల్కాజీ నుంచి సీఎం అతిషి పోటీ చేయనున్నారు. తుది జాబితా ప్రకటనతో ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ప్రజాకోర్టు' తీర్పు తర్వాత మాత్రమే తిరిగి ఆ పదవి చేపడతానని అన్నారు. అలాగే కాంగ్రెస్‌తో ముందస్తు ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని తేల్చిచెప్పారు. సొంత బలంతోనే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

# అసమర్థ రేవంత్ పాలనలో తెలంగాణ తిరోగమనం: కేటీఆర్



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో తెలంగాణ అద్భుతంగా పురోగమించిందని.. అనుభవరాహిత్యం, అసమర్థత, అవినీతి కలగలసిన రేవంత్ రెడ్డి పాలనలో నేడు అన్ని రంగాల్లో తిరోగమిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ అని.. ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాక ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు వృద్ధిని చూపిస్తాయన్నారు. కానీ, తెలంగాణలో రిజిస్ట్రేషన్లు తగ్గి, ఆదాయం తిరోగమనంలో ఉందన్నారు. మన పొరుగున ఉన్న అయిదు రాష్ట్రాలు ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయంలో 8 నుంచి 32శాతం వృద్ధిని నమోదు చేస్తే.. తెలంగాణ ఒక్కటే గత ఏడాది కంటే తక్కువ వృద్ధిని నమోదు చేయడం రాష్ట్రంలోని విఫల ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. పాలన గాలికొదిలేసి కక్షసాధింపు చర్యలకే పూర్తి సమయం కేటాయిస్తే ఫలితాలు ఇలా కాక మరెలా ఉంటాయి? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సర్కారు తీరుపై ఆయన మండిపడ్డారు.



## ఫలితాలు రానప్పుడు మాత్రమే..

# ఈవీఎంలను ప్రశ్నించడం తప్పు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఓటింగ్ పద్ధతిని ప్రశ్నించడంలో 'స్థిరంగా' ఉండాలని తెలిపారు. గెలిచినప్పుడు ఒక విధంగా, ఓడినప్పుడు మరో విధంగా మాట్లాడకూడదని హితవు పలికారు. కాగా, ఫలితాలు అంచనాలకు అందనప్పుడు మాత్రమే ఈవీఎంలను ప్రశ్నించడం తప్పు అని కాంగ్రెస్‌కు ఒమర్ అబ్దుల్లా చురక వేశారు. 'అవే ఈవీఎంలతో మీరు (కాంగ్రెస్) వంద మందికి పైగా పార్లమెంటు సభ్యులను పొందారు. మీ పార్టీ విజయంగా దానిని సెలబ్రేట్ చేసుకున్నారు. కొన్ని నెలల తర్వాత ఆశించిన విధంగా ఫలితాలు రానప్పుడు ఈవీఎంలకు వ్యతిరేకంగా మాట్లాడకూడదు. ఓటింగ్ యంత్రాంగంపై నమ్మకం లేని పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయకూడదు' అని అన్నారు. మరోవైపు ఓటర్లు ఒకసారి ఎన్నుకుంటారని, మరోసారి ఎన్నుకోరని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. దీనికి తానే ఉదాహరణ అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిన తాను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినట్లు చెప్పారు. అయితే తాను ఎప్పుడూ కూడా ఈవీఎంలను నిందించలేదని అన్నారు.

# డాక్టర్‌గా సామాజిక సేవ చేయడం తృప్తిగా ఉంది

## డాక్టర్ రాజ్ కుమార్



జాయ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): చిన్నతనం నుండే తమ పూర్వీకులతో అలవర్చుకున్న సామాజిక సేవ డాక్టర్ అయిన తర్వాత బీదలకు సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని డాక్టర్ రాజ్ కుమార్ అన్నారు. ప్రభాత సూర్యుడు పత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ అతి కష్టంగా ఎంబిబిఎస్ పూర్తి చేసి, డాక్టర్ గా గుర్తింపు తెచ్చుకొని ప్రజలకు ఆరోగ్య, సామాజిక సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను అని డాక్టర్ రాజ్ కుమార్ అన్నారు. ఆరోగ్య సమస్యలతో వచ్చే నిరుపేదలకు వైద్య సేవలు చేయడం, సామాజిక బాధ్యతగా భావి భావిస్తున్నానని డాక్టర్ రాజ్ కుమార్ అన్నారు. పద్మల్ గ్రామంలో జాయ్ ఫౌండేషన్ ఇనిషియేటివ్ 2008 లో 80 మందితో మొదలు పెట్టానని ఇప్పుడు వందల మంది నిరుపేదలు తమ చారిటబుల్ క్లినిక్ వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు చేసుకుంటున్నారని అన్నారు, శనివారం నాడు 140 మంది పైనే సన్న, చిన్న కారు రైతులు తమ క్లినిక్ కు వచ్చి వైద్య పరీక్షలు చేసుకున్నారని అన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు కీళ్ల వ్యాధులతో బాధపడుతున్న రైతులకు అన్ని రకాల పరీక్షలు చేసి, ఉచితంగా నెలకు సరిపోను మందులు ఇవ్వడం జరిగిందని అన్నారు. పడ్గల్ చుట్టుపక్క గ్రామాల రైతులు ప్రతి నెల క్రమం తప్పకుండా వచ్చే రైతులకు తమ క్లినిక్ లో శరీరంలోని రక్తం లోని షుగర్ లెవెల్ మరియు రక్త పోటు పరీక్షలు ఉచితంగా తమ జాయ్ ఫౌండేషన్ తరపున పరీక్షలు నిర్వహించి నెలకు సరిపోను మందులు ఉచితంగా ఇస్తామని అన్నారు. ఆరోగ్య సమస్యలతో వచ్చే రైతులకు తమ జారీ ఫౌండేషన్ తరపున రికార్డు పుస్తకమును ఇస్తుందని అందులో రైతు యొక్క రోగ నిర్ధారణ వివరాలు, సంబంధించిన మందులు తదితర అన్ని అంశాలు ఆ పుస్తకంలో పొందపరుస్తామని అన్నారు. క్రమం తప్పకుండా రైతులు ఆ పుస్తకాన్ని ప్రతినెల తమ క్లినిక్ సెంటర్ కు తీసుకు వస్తారని అన్నారు. దాంతో తమకు సేవలు చేయడం సులువు అవుతుందని అన్నారు. గత 8 సంవత్సరాలుగా ఎటువంటి అంతరాయం లేకుండా రైతులకు ఉచిత సేవలు చేయడం ఒక డాక్టర్ గా సంతృప్తిగా ఉన్నదని డాక్టర్ రాజ్ కుమార్ తెలిపారు.



# కేవైసీ పేరిట మళ్లీ మోసాలు

## వృద్ధులను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): సైబర్ నేరగాళ్లు కేవైసీ పేరుతో మళ్లీ మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.1.11 కోట్లు కొల్లగొట్టారు. బ్యాంకు ఖా తాలను అప్‌డేట్ చేసుకునేందుకు కేవైసీ పూర్తి చేయాలంటూ కేటుగాళ్లు వాట్సప్ ద్వారా లింకులు పంపుతున్నారని, వాటిని క్లిక్ చేసిన వెంటనే ఆయా ఖాతాదారుల వివరాలు, ఫొటోలు, ఐడీలు, ఓటీపీలు సేకరించడం ద్వారా బ్యాంకు ఖాతాలను క్లోనింగ్ చేసి డబ్బులు కొల్లగొడుతున్నారని పోలీసులు గుర్తించారు. ఇలాంటి కేటుగాళ్ల చేతిలో వృద్ధులు ఎక్కువగా మోసపోతున్నట్టు తెలుస్తున్నది.

### మోసం జరిగేది ఇలా..

కేవైసీ అనేది బ్యాంకులు, ఇతర సంస్థలు తమ కస్టమర్ల గుర్తింపును ధ్రువీకరించుకునే ప్రక్రియ. దీనిలోని లోపాలను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు ప్రజలను మభ్యపెడతారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారితోపాటు ఇంటర్నెట్‌లో వెతుకుతున్నవారి వివరాలను తెలుసుకుని ఫలానా అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తారు. అనంతరం వారికి ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారంతోపాటు బ్యాంకు ఖాతాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీల వివరాలు సేకరిస్తారు. వాటి ఆధారంగా డబ్బును కొల్లగొడతారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

సంపాదకీయం EDITORIAL



## బిగ్‌బాస్-8 విన్నర్ నిఖిల్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): బిగ్‌బాస్ సీజన్ 8లో నిఖిల్ విజేతగా నిలిచారు. ఆఖరి వరకు గట్టి పోటీనిచ్చిన గౌతమ్ రన్నర్‌గా నిలిచారు. ఫైనల్ ఎపిసోడ్‌కు చీఫ్ గెస్ట్‌గా ప్రముఖ నటుడు రాంచరణ్ హాజరయ్యారు. నిఖిల్‌కు ట్రోఫీతో పాటు రూ.55లక్షల ప్రైజ్‌మనీ, కారును బహుమతిగా అందజేశారు. విజేత నిఖిల్ మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ తల్లిని అంగీకరించం

**ఊరూరా ఉద్యమ తల్లినే ప్రతిష్ఠిస్తం**
**విగ్రహంలో బతుకమ్మను కాపాడుకుంటం**
**జీవోలు, కేసులతో భయ పెట్టలేరు**
**తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ సర్కార్ దాడిని గ్రామగ్రామాన ఎండగడుతం**
**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**
**ధరూర్‌లో 22 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ**



జగిత్యాల, (ప్రభాత సూర్యుడు): జీవోలు, కేసులతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ భయ పెట్టలేరని తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మె ల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టంచేశారు. జగిత్యాల రూర ల్ మండలం ధరూర్ శివారులో 22 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం ఆమె భూమిపూజ చేశారు.
అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఉ ద్యమకాలంలో ప్రజల్లో ఉత్సాహం, ధైర్యం, స్ఫూర్తిని రగిలించి రక్షగా నిలిచిన ఉద్యమ తెలంగాణ తల్లిని కాదని, ఆమె చేతిలో ఉన్న బతుకమ్మను లేకుండా చేసి సీఎం రేవంత్ తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.
సెక్రటేరియట్‌లో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని తెలంగాణ తల్లిగా స మాజం అంగీకరించే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రె స్ ప్రభుత్వం, సీఎం చేస్తున్న దాడిని గ్రామగ్రామాన ఎండగడుతామని చెప్పారు. ప్రభుత్వ గెజిట్‌ను పట్టించుకోబోమని, 22 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తీరుమని స్పష్టంచేశారు.

### ఒక్కో మహిళకు సీఎం రూ.30వేల బాకీ

'జగిత్యాలకు రావడానికి పెద్ద కారణమే ఉన్నది. కాంగ్రెస్, సీఎం రేవంత్‌కు తెలంగాణ తల్లి, తెలంగాణ బతుకమ్మ వద్దట.. వాటిని లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నరు. ఈ కుట్రలను ప్రజలకు వివరించి చెప్పేందుకే ఇక్కడికి వచ్చిన' అని కవిత పేర్కొన్నారు. 'తెలంగాణ మహిళలకు తల్లి లేకుండా, బతుకమ్మనే లేకుండ చేస్తున్న సీఎం కనీసం ఎన్నికల్లో ఇచ్చిన హా మీలనైనా అమలు చేస్తున్నాడా అంటే అదీలేదు! మహిళలకు మహాలక్ష్మి పథకం వస్తున్నదా? ఒక్కో ఆడబిడ్డకు నెలకు రూ.2500 వస్తున్నాయా?' అని ప్రశ్నించారు.
ఒక్కో మహిళకు రేవంత్‌రెడ్డి రూ.30 వేలు బాకీ పడ్డారని చెప్పారు. వృద్ధులకు నెలకు 4 వేల పెన్షన్ ఇస్తున్నాడా? అని నిలదీశారు. వృద్ధులకు నెలకు 2వేల చొప్పున సైతం బాకీ పడ్డాడని, దివ్యాంగులకు నెలకు 6 వేల పెన్షన్ ఇస్తానని చెప్పి ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడిపై బీఆర్ఎస్ తరఫున అసెంబ్లీలో నిలదీస్తామని చెప్పారు.

### కార్యకర్తలను కాపాడుకుంటాం

జగిత్యాల నుంచి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ అసెంబ్లీ సమావేశాలకు ఏ ముఖం పెట్టుకొని పోతా రో ప్రజలకు చెప్పాలని కవిత నిలదీశారు. కేసీఆర్ బొమ్మ పెట్టుకొని గెలిచిన ఆయన ప్రజలను వదిలిపెట్టిపోయడని, పార్టీ ఎందుకు మారారని అడిగితే పైస ల కోసం మారానని చెప్తున్నారని, ప్రజలను వదిలి పైసల వెంట పడే వారు ఏనాటికీ నాయకులు కాలేరని చెప్పారు. పార్టీకి కొందరు ఎమ్మెల్యేలు ద్రోహం చేసి పోయినా, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు మాత్రం పార్టీ వెంటే ఉన్నారని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు, భయపడాల్సిన అవసరం లేదని, అందరినీ కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు.

### కస్తూర్బాల్లోనూ కామన్ డైట్ మెనూ పాటించాలి

కస్తూర్భా పాఠశాలల్లోనూ కామన్ డైట్ మెనూను పాటించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి భూమిపూజ అనంతరం జగిత్యాలకు చేరుకున్న ఆమె, కొత్తబస్టాండ్ చౌరస్తా లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అంజ లి ఘటించారు. ఆ తర్వాత సారంగాపూర్‌లోని కస్తూర్బా రెసిడెన్షియల్ పాఠశాలకు చేరుకున్నారు. ఇక్కడ ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు పెరిగిపోయాయని విమర్శించారు. ఏడాదిలోనే 49 మంది చిన్నారులు విద్యాసంస్థలో చనిపోవడం బా ధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పోరాటంతోనే ప్రభుత్వం దిగివచ్చి గురుకులాల్లో మెనూ ను మార్చివేసిందని చెప్పారు. కామన్ డైట్ మెనూను రూపొందించడంతో పాటు, వాటికి నిధులు కూడా పెంచిందని తెలిపారు. కస్తూర్బా పాఠశాలలను కామ న్ డైట్ పరిధిలోకి తేకపోవడం సరికాదన్నారు. అంతకు ముందు ధరూర్ శివారులో మహిళలతో కలిసి కవిత ఉత్సాహంగా బతుకమ్మ ఆడిపాడారు.
కార్యక్రమాల అనంతరం కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన బీఆర్ఎస్ నాయకుడు సృజన్‌రావు కుటుంబ సభ్యులను మేడిపల్లిలో కవిత పరామర్శించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ యూత్ నాయకుడు దావ సురేశ్, మాజీ జడ్పీటీసీ రమ్మోహన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ప్రియాంక ప్రవీణ్, కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, కేసరి బాబు పాల్గొన్నారు.





## సంపన్నులపై పన్నులు పెంచండి

**ఆర్థిక అసమానతలు తగ్గేందుకు ఇదే మార్గం**
**భారత్‌కు ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెట్టి సూచన**

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): భారత్‌లో ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ధనవంతులపై ఎక్కువ పన్నులు విధించాలని ఫ్రెంచ్ ఆర్థికవేత్త, 'కాపిటల్ ఇన్ ది ట్వెంటీ ఫస్ట్ సెంచరీ' పుస్తక రచయిత థామస్ పికెట్టి సూచించారు. రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలోని రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఆస్తులు ఉన్న సంపన్నులపై 2 శాతం సంపద పన్ను విధిస్తే దేశ జీడీపీలో 2.73 శాతానికి సమానమైన వార్షిక ఆదాయం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రూ.10 కోట్ల పైన విలువైన ఆస్తులపై 33 శాతం వారసత్వ పన్నును కూడా విధించాలని ఆయన సూచించారు. 2022-23లో జాతీయ ఆదాయంలో 22.6 శాతం వాటా దేశంలోని అత్యంత సంపన్నులైన 1 శాతం జనాభాదేనని, దేశం మొత్తం సంపదలో 40.1 శాతం వారి వద్దే ఉ ందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ జాతీయ ఆదాయంలో అత్యంత ధనికులైన 1 శాతం మంది వాటా విలువ అమెరికా, బ్రెజిల్‌లలోని 1% ధనికుల వాటాను మించిపోయిందని ఆయన అన్నారు. అయితే, పికెట్టి సూచనను ఇదే కార్యక్రమంలో పాల్గొన్న భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ వ్యతిరేకించారు. కాగా, భారత ప్రభుత్వం 2015లో సంపద పన్నును రద్దు చేసింది. వారసత్వ పన్నును తీసుకురావాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పన్ను విధించబోమని ఏప్రిల్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.



## బెంగళూరు టెకీ కేసులో కీలక పరిణామం

**అతుల్ సుభాష్ భార్య, అత్త అరెస్టు**

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అతుల్ సుభాష్ భార్య నిఖితా సింఘానియా, అత్త నిషా, బావమరిది అనురాగ్‌ను కర్ణాటక పోలీసులు అరెస్టు చేశారు. అతుల్ భార్య నిఖితాను హరియాణాలోని గురుగ్రామ్‌లో అరెస్టు చేయగా.. అత్త, బావమరిదిని ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్లుగా పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచి. జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. భార్య వేధింపుల కారణంగా బెంగళూరుకు చెందిన టెకీ అతుల్ సుభాష్ బలవన్మరణానికి పాల్పడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు అతను రాసిన 24 పేజీల సుదీర్ఘమైన లేఖ, 80 నిమిషాల వీడియో అందర్నీ కదిలించింది. సూసైడ్ నోట్‌లో తన భార్యతో కొనసాగుతున్న వైవాహిక బంధ వివాదం గురించి పేర్కొన్నాడు. భరణం కోసం తమ నాలుగేండ్ల కొడుకును తన భార్య తనపైకి అస్త్రంగా ప్రయోగించిందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ కుటుంబ న్యాయస్థానంలో తనపై తన భార్య కుటుంబం పెట్టిన కేసుల్లో హత్య, అసహజ శృంగారం, భరణం కోసం నెలకు రూ.2 లక్షల డిమాండ్ ప్రధానమైనవని వెల్లడించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, టెకీ ఆత్మహత్య నేపథ్యంలో 'మెన్‌టూ' అన్నది ఎక్స్‌లో ట్రెండింగ్‌గా మారింది. చట్టాలన్నీ మహిళలకు అనుకూలంగానే ఉన్నాయని నెటిజన్లు పోస్టులు పెట్టారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు ఉన్న ఐపీసీ సెక్షన్ 498ఏను దుర్వినియోగం చేయడంపై న్యాయస్థానాలు సైతం ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఈ క్రమంలోనే ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు అతుల్ భార్య, కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకున్నారు.

## దేశంలో తొలి డయాబెటిస్ బయోబ్యాంక్

**చెన్నైలో స్థాపించిన ఐసీఎంఆర్**

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): సైంటిఫిక్ పరిశోధనలను బలపరిచే లక్ష్యంతో ప్రజలకు సంబంధించిన జీవసంబంధ నమూనాలను భద్రపరిచే దేశంలోనే మొట్టమొదటి డయాబెటిస్ బయో బ్యాంకును భారతీయ వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) చెన్నైలో స్థాపించింది. మద్రాసు డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్(ఎండీఆర్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ బయోబ్యాంకు ఏర్పడింది. బయోస్పెసిమెన్ల సేకరణ్, ప్రాసెస్ చేయడం, భద్రపరచడం, పంపిణీ చేయడం ఈ బయోబ్యాంకు లక్ష్యాలు. ఐసీఎంఆర్ అనుమతితో శాస్త్రీయ పరిశోధనలకు ఈ బయోబ్యాంకు తోడ్పాటును అందిస్తుంది. డయాబెటిస్ వచ్చేందుకు కారణాలు, డయాబెటిస్‌లో భారతీయ రకాలకు చెందిన తేడాలు, సంబంధిత రుగ్మతలను బయోబ్యాంకు సాయంతో ఆధునిక పరిశోధనలు జరుగుతాయని ఎండీఆర్ఎఫ్ చైర్మన్, డాక్టర్ వీ మోహన్ తెలిపారు.

# ఆ నెయ్యి తయారైంది ఏఆర్ డెయిరీలో కాదు

## తిరుమల లడ్డూ కల్తీ కేసులో కీలక విషయం వెల్లడి

తిరుమల, న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న కేసులో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. అసలు ఆ నెయ్యి ఏఆర్ డెయిరీ తయారు చేసింది కాదని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తేల్చింది. లడ్డూ ప్రసాదం తయారీకి అవసరమైన నెయ్యిని సరఫరా చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)తో ఒప్పందాన్ని కుదుర్చుకున్న ఏఆర్ డెయిరీ నిర్వాహకులు ఆ ఒప్పందానికి విరుద్ధంగా వైష్ణవి డెయిరీ నుంచి నెయ్యి సేకరించారని, అనంతరం ఆ నెయ్యిని ఏఆర్ డెయిరీ ట్యాంకర్ల ద్వారా టీటీడీకి సరఫరా చేశారని సిట్ అధికారులు గుర్తించారు. ఆ ట్యాంకర్లు వెళ్లిన మార్గాలు, టోల్‌గేట్ వద్ద ఆగిన సమయాలు సహా అన్ని ఆధారాలను పక్కాగా సేకరించారు. ఆ వివరాలను ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీబీఐ డైరెక్టర్‌కు వివరించారు. అంతకుముందు వారు తిరుమలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రసాదం తయారీకి సేకరిస్తున్న నెయ్యి, శనగపప్పు తదితర సరుకులతోపాటు వాటి నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను పరిశీలించారు. పోటు ఏఈవో మునిరత్నంతో మాట్లాడి రోజువారీ విక్రయాలు, సరుకుల పంపిణీ వివరాలను తెలుసుకున్నారు.





### తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 22 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వేచి చూస్తున్నారు. ప్రస్తుతం టోకెన్లు లేని భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు 18 గంటలకుపైగా సమయం పడుతుండగా.. రూ.300 ప్రత్యేక దర్శనానికి 2 నుంచి 3 గంటల సమయం పడుతున్నది. శనివారం 72,692 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారిలో 30,645 మంది స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. హుండీ ద్వారా శనివారం శ్రీవారికి రూ.3.37 కోట్ల ఆదాయం వచ్చినట్టు అధికారులు వెల్లడించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215